# కేటీఆర్ చొరవతో స్వదేశానికి

- మలేషియా జైల్లో మగ్గుతున్న తెలంగాణబిడ్డలను విడుదల చేయించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- నందినగర్‌లో కేటీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పిన బాధితులు
- సొంత ఖర్చులతో మలేషియాలో న్యాయ పోరాటం చేసి విడిపించిన బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్
- విడిపించడానికి భారత రాయబార కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం ముందుకురాకపోవడం విచారకరం: మాజీ మంత్రి కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మలేషియా బాధితులు, వారి కుటుంబీకులు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : దేశంకాని దేశానికి పోయి.. అక్కడి చట్టాలు తెలియక జైలుపాలై.. చిమ్మచీకట్లు కమ్ముకున్న తెలంగాణ బిడ్డల జీవితాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త వెలుగులు నింపారు. విదేశీ జైలు గోడల మధ్య మగ్గిపోతున్న అభాగ్యులకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. వారిని ఎలాగైనా సొంత గూటికి చేర్చాలన్న సంకల్పంతో తమ పార్టీ నేత భూక్య జాన్సన్‌నాయక్‌ను పురమాయించారు. మలేషియా జైలు నుంచి విడుదలై స్వరాష్ట్రానికి చేరుకున్న బాధితులు బుధవారం నందినగర్‌లో కేటీఆర్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. కంటి నుంచి రాలుతున్న నీటిచెమ్మను తుడుచుకుంటూ పుట్టిన గడ్డను, తమ పిల్లలను చూస్తామని కలలో కూడా అనుకోలేదని భావోద్వేగానికి లోనయ్యారు. కేటీఆర్‌కు, జాన్సన్‌నాయక్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్, దస్తురాబాద్ మండలం మూన్యాల్ గ్రా మాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఉపాధి కోసం నిరుడు మలేషియాకు వెళ్లారు. అక్కడ అరెస్టయి జైలు పాలయ్యారు. విషయం కేటీఆర్ దృష్టికి రావడంతో బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్‌తో మాట్లాడి బాధితులను విడుదల చేయించి స్వదేశానికి తీసుకు రావాలని సూచించారు.

### వాళ్లిద్దరికీ రుణపడి ఉంటం

“ రెండున్నరేండ్ల కింద మలేషియాకు పోయినం. విజిట్ వీసాతోనే మలేషియాలో చిక్కుకపోయినం. కంపెనీల్లో పనులు చేసుకున్నం. అక్కడ విరుద్ధంగా పనిచేస్తున్నామని పోలీసులు అరెస్టు చేసిండ్రు. మొత్తం 22మందిమి ఆరు నెలలు జైల్లో ఉన్నం. వారిలో తెలంగాణ వాళ్లం ఆరుగురం ఉన్నం. మేము పడుతున్న కష్టాలను మావాళ్లు జాన్సన్ నాయక్‌కు చెప్పిండ్రు. ఆయన వెంటనే స్పందించి రెండు నెలల కింద మలేషియాకు వచ్చి జైలులో మమ్మల్ని కలిసిండ్రు. ఆ తర్వాత మొత్తం ప్రాసెస్ పూర్తి చేయించిండ్రు. బుధవారం కేటీఆర్ సార్‌ను కలిసినం. ఆయన మా బాగోగులు చూసుకుంటనని భరోసా ఇచ్చిండ్రు. మమ్మల్ని స్వదేశానికి రప్పించిన కేటీఆర్ సారుకు, జాన్సన్ నాయక్ సారుకు జీవితాంతం రుణపడి ఉంటం.

– గురిజల శంకర్, లింగాపూర్, కడెం మండలం, నిర్మల్ జిల్లా



తల్లితో కన్నీళ్లు పెట్టుకుంటున్న బాధితుడు

#### సొంత ఖర్చులతో రప్పించిన జాన్సన్‌నాయక్

కేటీఆర్ సూచనతో జాన్సన్‌నాయక్ బాధిత కుటుంబాలను కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. వారి దీనస్థితిని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ సూచనతో మార్చిలో మలేషియాకు వెళ్లి జైలులో ఉన్న లింగాపూర్‌కు చెందిన రాచకొండ నరేశ్, తలారి భాస్కర్, గురుజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, మూన్యాల్‌కు చెందిన యమునూరి రవీందర్‌ను కలిసి విడుదల చేయిస్తానని భరోసా కల్పించారు. అక్రమ ఆయుధ కేసులో అరెస్టయ్యారని తెలుసుకున్న జాన్సన్ నాయక్.. సొంత ఖర్చులతో స్థానిక న్యాయవాదులను నియమించి వారి విడుదల కోసం న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 12న మలేషియాకు మళ్లీ వెళ్లి అక్కడి కోర్టు విధించిన జరిమానా మొత్తాన్ని చెల్లించారు. విమాన టికెట్లతోసహా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి వారిని స్వదేశానికి తీసుకొచ్చారు. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న బాధితులు జాన్సన్‌నాయక్‌తో వెళ్లి నందినగర్‌లో కేటీఆర్‌ని కలిశారు. కేటీఆర్‌ను చూడగానే కన్నీటిపర్యంతమయ్యారు. కేటీఆర్, జాన్సన్‌నాయక్ చేసిన కృషికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

#### జాన్సన్‌నాయక్‌ను అభినందించిన కేటీఆర్

చైనా, ఇతర దేశాలు తమ వారిని దగ్గరుండి వారం రోజుల్లోనే జైలు నుంచి విడిపించి తీసుకువెళ్లిపోయాయని బాధితులు కేటీఆర్‌తో తెలిపారు. వారిని ఓదార్చిన తర్వాత వారికి ఎదురైన కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వారి పరిస్థితి పట్ల ఆవేదన వ్యక్తంచేసిన కేటీఆర్.. భారత రాయబార కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం బాధితులను విడిపించేందుకు చర్యలు చేపట్టకపోవడం దారుణమని వాపోయారు. బాధితులను క్షేమంగా తీసుకొచ్చిన జాన్సన్‌నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ.. అహర్నిశలు కష్టపడుతున్నారని ప్రశంసించారు.

### బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా రామన్న

సిరిసిల్ల రూరల్, మే 21 : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంద మహేశ్ పొట్ట చేత పట్టుకుని ఉపాధి కోసం భార్య, పిల్లలు, తల్లి దండ్రులను వదిలి ఎడారి దేశానికి వెళ్లగా, విధి వంచించింది. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో బయట పడ్డా.. అచేతన స్థితితో దవాఖానలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాడు. దీంతో సెల్ఫీ వీడియో ద్వారా తన గోడును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వెళ్లబోసుకున్నాడు. 'రామన్న.. నన్ను ఆదుకోండి.. కాపాడు.. నా భార్యాపిల్లల చెంతకు తీసుకెళ్లు..ఈ నరకం భరించలేకపోతున్నా' అంటూ విలపిస్తూ వేడుకోగా, కేటీఆర్ తక్షణమే స్పందించి.. నాలుగైదు రోజుల్లో తీసుకువస్తా అంటూ ఆపన్నహస్తం అందించారు. అనంతరం ఈనెల 11న మహేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత మహేశ్ వివరాలు తెలుసుకుని ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో గురువారం సౌదీ నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మహేశ్ చేరుకోనున్నాడు. మహేశ్‌కు భార్య పిల్లలు ఉన్నారు.



ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకుడు కేకేతో పంపిణీ చేయిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పక్కన ఏఎంసీ చైర్ పర్సన్

## అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు

ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల రూరల్, మే 21: ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సీఎస్ ఇటీవల ఆదేశించారు. ఈ ఆదేశాలు వచ్చి రెండు రోజులు కాకముందే రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండల కేంద్రాల్లో అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంలా నిర్వహించిన తీరుపై పలువురు అసహనం వ్యక్తంచేశారు. బుధవారం రెండు చోట్ల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. అధికారిక వేదికపై ఉంచిన ప్లెక్సీపై ప్రొటోకాల్ నిబంధనలను తుంగలో తొక్కి స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో ముద్రించకపోవడంపై పలువులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారిక కార్యక్రమ సభావేదికపై ఎలాంటి పదవి లేని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని కలెక్టర్ తన పక్కన కూర్చోబెట్టుకోవడంతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం విమర్శలకు తావిచ్చింది. ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలోనూ కలెక్టర్ పార్టీ నాయకుడు కేకే మహేందర్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందించి ప్రొటోకాల్ నిబంధనలను విస్మరించారు.

## విదేశీ పర్యటనకు మంత్రి తుమ్మల బృందం

హైదరాబాద్, మే 21(నమస్తే తెలంగాణ): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు మరో ఏడుగురు అధికారుల బృందం విదేశీ పర్యటన ఖరారైంది. నెదర్లాండ్స్, పారిస్‌ల్లో పర్యటించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 10నుంచి 15వరకు ఆరురోజుల పాటు ఈ బృందం ఈ రెండు దేశాల్లో పర్యటించనున్నది. నెదర్లాండ్స్‌లోని అమ్‌స్టర్‌డామ్‌లో నిర్వహించే గ్రీన్ టెక్–2025 సదస్సులో పాల్గొనున్నది. ఆ తర్వాత పారిస్‌లోని రంగిస్ ఇంటర్నేషనల్ మార్కెట్‌ను సందర్శించనున్నది. ఈ బృందంలో మంత్రి తుమ్మలతోపాటు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్, ఉద్యానశాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, మంత్రి ఓఎస్డీ శ్రీధర్, మార్కెటింగ్‌శాఖ సూపరింటెండెంట్ అరుణ్ బాబు, ఉద్యానశాఖ అధికారి అర్చన, వ్యవసాయశాఖ అధికారి విశ్వనాథ్ ఉన్నారు. అయితే మంత్రితోపాటు అధికారుల బృందం రెండు దేశాల పర్యటనపై వ్యవసాయశాఖ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఈ రెండు దేశాలకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యవసాయరంగానికి, రైతులకు ఏమైనా ఉపయోగం ఉంటుందా అని నిలదీస్తున్నారు. చిన్నచిన్న ఉద్యోగులకు బకాయిలు ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవు గానీ.. అధికారులను విదేశాలకు పంపించేందుకు నిధులున్నాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వెళ్లినా ఇద్దరో ముగ్గురో వెళ్తారు గానీ, ఇలా ఎనిమిది మంది వెళ్లడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

## ప్రతిఒక్కరి జీవితంలో చదువే కీలకం : సీతక్క

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): ప్రతిఒక్కరి జీవితంలో చదువే ఎంతో కీలకమని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో చదువు లేకపోవడంతో చిన్నచూపు చూశారు.. మనల్ని అక్షరానికి దూరం చేశారు.. అనాగరికులమని ముద్ర వేశారు.. ఇపుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ప్రైవేటు విద్యార్థులతో పోటీగా గిరిజన గురుకులాల్లోని విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధిస్తున్నారు' అని సీతక్క పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన గిరిజన గురుకుల విద్యార్థులకు బుధవారం బంజారాహిల్స్‌లోని కుమ్రంభీం ఆదివాసీభవన్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిక్సస క్సెస్ మీట్–2025లో ఆమె ప్రతిభా పురస్కారాలు అందజేసి అభినందనలు తెలిపారు. గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆదివాసీ గిరిజన పెయింటింగ్స్‌తో రూపొందించిన చీరను సీతక్కకు బహూకరించారు. అనంతరం స్టేట్ ర్యాంకర్స్‌తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యానాయక్, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కే తిరుపతి, గిరిజనశాఖ కార్యదర్శి శరత్, గిరిజన గురుకుల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన కోయ, ఆదివాసీ గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## సునీతారావుకు షాక్ ఇచ్చిన ఏఐసీసీ

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతారావుకు కాంగ్రెస్ అధిష్ఠానం (ఏఐసీసీ) షాక్ ఇచ్చింది. ఇటీవల ఆమె టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిలపై విమర్శలు చేసిన నేపథ్యంలో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల పార్టీ పదవుల విషయంలో ఆమె కొంతమంది మహిళా నేతలతో కలిసి గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ చాంబర్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సహకరించడం లేదంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై గోషామహల్ కాంగ్రెస్ మహిళా నేతలు సునీతారావుపై పార్టీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఐసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కాలాంబా బుధవారం సునీతారావుకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారంలోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సునీతారావు షోకాజ్ నోటీసుల వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

## 52మంది ఉత్తమ పోలీసులకు రివార్డులు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసులకు డీజీపీ జితేందర్, సీఐడీ డీజీ శిఖాగోయెల్ బుధవారం డీజీపీ కార్యాలయంలో నగదు రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యంత క్లిష్టమైన నేరాల పరిష్కారం, అత్యుత్తమ శిక్షలు, పెండింగ్ కేసుల పరిష్కారం, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, పోక్సో కేసుల పరిష్కారం, నేషనల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, సైబర్ నేరాల్లో అత్యధిక రీఫండ్ తదితర అంశాల్లో విశిష్ట ప్రతిభ ఆధారంగా 52మంది సిబ్బందికి సర్టిఫికెట్లతోపాటు, క్యాష్ రివార్డును అందజేసినట్టు తెలిపారు. వీటితోపాటు ఆయా పోలీస్‌స్టేషన్లలో సిబ్బందిపై పౌరుల అభిప్రాయం (సిటిజన్ ఫీడ్‌బ్యాక్), క్యూర్ కోడ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉత్తమంగా రేటింగ్ పొందిన టాప్–3 యూనిట్లు (హైదరాబాద్, మెదక్, రామగుండం)తోపాటు, టాప్–10లో నిలిచిన పోలీస్‌స్టేషన్ల సిబ్బందిని సత్కరించామని పేర్కొన్నారు. పోలీసుశాఖలో ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటలిజెన్స్ డీజీ బీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీలు మహేశ్‌భగవత్, అనిల్‌కుమార్, ఐజీలు రమేశ్, చంద్రశేఖర్ రెడ్డి, రమేశ్ నాయుడు, శ్రీనివాస్, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, ఎస్పీ శ్రీనివాస్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నీటి వనరుల పునరుద్ధరణ సెల్ ఏర్పాటు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర స్థాయిలో నీటి వనరుల పునరుద్ధరణ సెల్‌ను (డబ్ల్యూఆర్ఆర్‌సీ) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. డబ్ల్యూఆర్ఆర్‌సీ చైర్మన్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్‌ను నియమించారు. సభ్యులుగా డిప్యూటీ సెక్రటరీ టు గవర్నమెంట్ (అర్బన్ లోకల్ బాడీస్, సీఎస్ఎస్), హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మేనేజింగ్ డైరెక్టర్, నీటిపారుదలశాఖ/వ్యవసాయశాఖ నుంచి ప్రతినిధి, విద్యుత్‌శాఖ నుంచి ప్రతినిధి, ఇంజినీర్ ఇన్ చీఫ్ (పబ్లిక్ హెల్త్), పరిశ్రమలశాఖ నుంచి ప్రతినిధి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి ప్రతినిధిని నియమించారు. మెంబర్ కన్వీనర్‌గా తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ ఐడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను నియమించారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని టీయూఎఫ్ఐడీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను సీఎస్ ఆదేశించారు.

## తెలంగాణ సీఎస్‌కు అభిలాష బిస్త్ రిపోర్ట్

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐపీఎస్ అధికారి, డీజీ అభిలాష బిస్త్‌ను తెలంగాణకు కేటాయిస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె తెలంగాణ సీఎస్ రామకృష్ణారావుకు తన జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఏపీ కేడర్‌లో చేరాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అభిలాష బిస్త్ సవాలు చేయగా, ఇటీవల హైకోర్టు తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. క్యాట్ తేల్చే వరకు ఆమెను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పేర్కొంది. క్యాట్ తుది ఉత్తర్వులు జారీ చేసే వరకు ఏపీ కేడర్‌లో చేరాలని ఆదేశిస్తూ జనవరి 19న కేంద్రం ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా ఉన్న ఆమెకు ఏపీ ప్రభుత్వం బుధవారం రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చింది. ఆమె తెలంగాణ సీఎస్‌కు తన జాయినింగ్ ఆర్డర్‌తో రిపోర్టు చేశారు.



పెద్దవంగరలోని రేషన్ షాపులో ఇచ్చిన సన్నబియ్యంతో వండిన అన్నాన్ని చూపుతున్న మహిళలు

## సన్నబియ్యం ఇచ్చేం లాభం..?

**మెత్తబడిన అన్నం తినలేకపోతున్నం : లబ్ధిదారులు**

పెద్దవంగర, మే 21: 'రేషన్ షాపుల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇచ్చేం లాభం? వంట చేస్తే మెత్తబడుతున్నది' అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలకేంద్రానికి చెందిన మహిళలు సన్నబియ్యం అన్నంపై చర్చించుకుంటున్న వీడియో ఒకటి బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పెద్దవంగరకు చెందిన మహిళలు ఇటీవల రేషన్ షాపులో సన్నబియ్యంతో వంట చేస్తే అన్నం మెత్తగా రబ్బరులాగా మారి తినడానికి ఇబ్బందిగా ఉందని.. ఇలాంటి బియ్యం ఇచ్చి ఏం లాభమని అభిప్రాయపడ్డారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

## వరంగల్, హనుమకొండ కలెక్టరేట్లకు బాంబు బెదిరింపు

సుబేదారి, మే 21: హనుమకొండ కాళోజీ జంక్షన్‌లోని వరంగల్ జిల్లా కలెక్టరేట్, సుబేదారిలోని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో బాంబు పెట్టామని బుధవారం ఓ అగంతకుడు వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ఓ అధికారికి ఫోన్ చేశాడు. దీంతో బాంబు, డాగ్ స్క్వాడ్ పోలీసులు రంగంలోకి దిగారు. హుటాహుటిన రెండు జిల్లాల కలెక్టరేట్లకు చేరుకొని విస్తృతంగా తనిఖీలు చేశారు. బాంబులు కనిపించకపోవడంతో అది బెదిరింపు కాల్‌గా నిర్ధారణ కావడంతో అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్ల జేఏసీ నేతలు

## 27న ఆటోవాలాల ఆకలికేకలు

**ధర్నాచౌక్‌లో భారీ సభకు సమాయత్తం**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): ఉపాధి లేక ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆటోడ్రైవర్ల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆటోడ్రైవర్ల కుటుంబాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 27న ఇందిరాపార్కు వద్దనున్న ధర్నాచౌక్‌లో 'ఆటో ఆకలి కేకలు' పేరిట భారీ సభను నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) అధ్యక్షుడు ఎం రవికుమార్ వెల్లడించారు. టీఏడీయూ ఆధ్వర్యంలో ఇటీవల ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పలుచోట్ల రోడ్డుషోలు నిర్వహించారు. అందు లో భాగంగా రవికుమార్ హైదరాబాద్ చేరుకోగా.. బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య నాచారంలో ఆటో ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం రవికుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ధర్నాచౌక్‌లో ఆటో ఆకలికేకలు మహాసభ పెద్దఎత్తున నిర్వహించబోతున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏడు లక్షలకుపైగా ఉన్న ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. ఉపాధి లేక డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఆటోడ్రైవర్లంటే సీఎంకు లెక్కేలేదని విమర్శించా రు. ఈ నెల 27 ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో జరగబోయే మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు, టీయూసీఐ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ ఆటో యూనియన్ కేంద్ర ప్రధానకార్యదర్శి రవిశంకర్ అల్లూరి, సీఐటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీకాంత్ పుప్పాల, టీఏడీడబ్ల్యూ అధ్యక్షుడు ఎంఏ సలీ, సత్తిరెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి రాంరెడ్డి హాజరవుతారని తెలిపారు. తాము సభలు నిర్వహించాలనుకున్న ప్రతిసారీ మంత్రి పొన్నం ప్రభాకర్ వచ్చి తమ సమస్యలు పరిష్కరిస్తామని ఆశజూపి సభ వాయిదా వేసుకునేలా చేస్తున్నారని విమర్శించారు. ఈసారి కచ్చితంగా పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తున్నట్టు స్పష్టంచేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే వరకు కలిసికట్టుగా పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు.

### గురుకులాల ఎత్తివేతను వెనక్కి తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ డిమాండ్**

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 12 గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేయాలనే నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. కార్పొరేట్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఇంటర్ చదువుతున్న పేద వర్గాలకు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నది. ఇప్పుడు వాటిని ఎత్తివేయడం ద్వారా విద్యార్థులు చదువుకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేసింది.

### ఫార్మసిస్ట్‌లను నియమించాలి

**మంత్రి దామోదరకు వినతి**

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని బస్తీ, పల్లె దవాఖానలలో ఫార్మసిస్ట్‌లను వెంటనే నియమించాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. బుధవారం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో డీఎంహెచ్‌వో పరిధిలోని ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోర్లు, మలేరియా, లెప్రసీ, టీబీ సెంటర్లలో ఫార్మసిస్ట్‌లను నియమించాలని విజ్ఞప్తిచేశారు.

## గురుకుల కార్యదర్శిపై మంత్రి దామోదర సీరియస్

- వసతులు ఎందుకు కల్పించడం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఆగ్రహం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణిపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాలోచిత నిర్ణయాలతో గురుకుల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వసతి కల్పించాలని ఆదేశించారు. నేటి నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అన్ని గురుకులాలు పరీక్షలు రాసే తమ విద్యార్థులకు భోజన, వాహన వసతులు కల్పిస్తున్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ మాత్రం ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో విషయాన్ని జై భీమ్ యూత్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీహరి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని, సిబ్బందిని సైతం బానిసల కంటే హీనంగా చూస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి సొసైటీ సెక్రటరీ వర్షిణికి ఫోన్‌చేసి వసతులు ఎందుకు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పూర్తి నివేదిక అందివ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

## గురుకుల బాలికపై లైంగికదాడి!


- కీచక లెక్చరర్‌పై పోక్సో కేసు
- జగిత్యాల జిల్లాలో దారుణం

మెట్‌పల్లి, మే 21 : జగిత్యాల జిల్లాలోని ఓ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలికపై ఓ లెక్చరర్ లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 5న బాలిక రజస్వల అయిందని తల్లిదండ్రులకు క్రీడా ఉపాధ్యాయురాలు ఫోన్ చేసి సమాచారం అందించడంతో వారు వచ్చి తమ కూతురిని తీసుకెళ్లారు. తిరిగి అదే నెల 12న పరీక్షలు రాయడానికి గురుకుల పాఠశాలకు పంపించారు. వేసవి సెలవుల్లో భాగంగా 23 న ఇంటికి తీసుకెళ్లగా బాలికకు కడుపు నొప్పి, అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యపరీక్షల్లో బాలిక రజస్వల కాలేదని గుర్తించిన వైద్యురాలు, ఏమైనా అఘాయిత్యం జరిగి ఉండవచ్చని చెప్పడంతో తల్లిదండ్రులు బాలికను నిలదీశారు. గురుకుల పాఠశాలలో ఓ లెక్చరర్ ఈ దారుణానికి పాల్పడినట్టు తెలిపింది. ఈనెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. ఈ ఘటనపై బుధవారం డీఎస్‌వో విచారణ జరిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడితోపాటు సహకరించిన వారిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## వస్తున్నా.. ఉండండి!

- ఉదయం తొమ్మిదింటికి వస్తా అని చెప్తారు.. రాత్రి పదైనా రారు!
- ఇదీ.. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి రోజువారి స్టైల్?
- అర్ధరాత్రి దాకా ఆఫీసులోనే సిబ్బంది ఎదురుచూపులు
- ఉద్యోగం చేయాలంటేనే చిరాకు వస్తుందని సిబ్బంది అసహనం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బాధలు వర్ణనాతీతంగా ఉన్నట్టు సమాచారం. ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి షెడ్యూల్‌లో సమయపాలన లేకపోవడంతో సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూపులతో గడపాల్సి వస్తున్నదని, తరచూ రాత్రి వేళల్లో పని చేయాల్సిన పరిస్థితి ఉంటున్నదని సిబ్బంది సన్నిహితుల వద్ద వాపోతున్నారు. సమయానికి స్పష్టమైన సూచనలు ఇస్తే తమ పని సులువవుతుందని చెప్తున్నారు. 'వస్తున్నా.. ఉండండి' అంటూ ఆదేశిస్తారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎక్కడికి వెళ్లాలో.. అని కారు డ్రైవర్, ఇద్దరు గన్‌మెన్లు, మరో ఇద్దరు సిబ్బంది.. అంతా రెడీగా ఉంటాం.. మధ్యాహ్నమైనా రారు.. సాయంత్రం మళ్లీ ఫోన్‌చేస్తే 'వస్తున్న ఉండండి..' అంటూ మళ్లీ చెప్తారు. 'అందరం ఇంటికి వెళ్దామనే ఆలోచనలో ఉండగా, రాత్రి పదిగంటల ప్రాంతంలో రావడం.. ఫైల్స్, పని అంటూ హడావుడి చేసి.. గంట గంటన్నరలో తిరుగుపయనం అవుతారు. మేమంతా ఇండ్లకు వెళ్లే సరికే అర్ధరాత్రి దాటుతుంది.. నెలలో ఎక్కువ రోజులు ఇదే తంతు. ఇక్కడ ఉద్యోగం చేయాలంటేనే చిరాకు వస్తున్నది' అని కొందరు సిబ్బంది మిత్రుల వద్ద ఆరోపిస్తున్నారు. 'వస్తున్న ఉండండి.. అనే మాట విన్నప్పుడల్లా నా ఓపిక నశించిపోతున్నది. రాత్రి పదిగంటలకు వచ్చేటట్టు ఉంటే.. సాయంత్రం ఆరెడు గంటలకు రమ్మనిచెప్తే అందరం వస్తాంగా.. ఎందుకు ఉదయం నుంచి పడిగాపులు కాయించి చంపటం. ఇదేం ఆనందమో! ఆ మనిషికి? ఇంత మంది దగ్గర పనిచేసినగానీ, ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని చూడలేదు' అని సిబ్బంది బంధువుల వద్ద చెప్తున్నారు.



## పోలీస్ కస్టడీకి ఉగ్ర కుట్రదారులు

- ఎన్ఐఏతో కలిసి సిరాజ్, సమీర్‌ను విచారించనున్న పోలీసులు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): ఉగ్రదాడులకు పాల్పడేందుకు కుట్రపన్నారన్న కేసులో ఏపీలోని విజయనగరానికి చెందిన సిరాజ్, తెలంగాణకు చెందిన సమీర్‌ను 5 రోజులపాటు పోలీస్ కస్టడీకి తరలించేందుకు స్థానిక కోర్టు ఆమోదం తెలిపింది. దీంతో విజయనగరం జిల్లా పోలీసులు గురువారం నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో కలిసి ఈ ఇద్దరు నిందితులను విచారించనున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఎన్ఐఏకి చెందిన ఉన్నతస్థాయి విచారణ బృందం విజయనగరానికి చేరుకుని, ఆ జిల్లా పోలీసుల నుంచి వివరాలు సేకరించింది. నిందితులు పేలుడు పదార్థాలను పరీక్షించే ప్రయత్నంలో ఉన్నారని, ఆ క్రమంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఓ హ్యాండ్లర్ పర్యవేక్షణలో రిమోట్‌తో పేల్చగలిగే ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ)లు తయారు చేయడం నేర్చుకుంటున్నారని తేల్చారు.

#### కుటుంబసభ్యులపై దర్యాప్తు సంస్థల నిఘా

ఈ కేసులో దూకుడు పెంచిన దర్యాప్తు సంస్థలు.. సిరాజ్ బ్యాంక్ ఖాతాల్లో భారీగా నగదు ఉన్నట్టు గుర్తించి, వాటిని సీజ్ చేశాయి. డీసీసీ బ్యాంక్‌లో సిరాజ్‌కు చెందిన లాకర్‌ను తెరిచేందుకు అతని తండ్రి (ఏఎస్సైగా పనిచేస్తున్నారు) విఫలయత్నం చేసినట్టు తెలుస్తున్నది. కానీ, అప్పటికే ఆ ఖాతాను సీజ్ చేసినందున లాకర్‌ను తెరవడం కుదరదని బ్యాంక్ అధికారులు చెప్పినట్టు సమాచారం. ఈ విషయమై సిరాజ్ తండ్రి రెండు రోజులపాటు బ్యాంక్ అధికారులను కలిసినట్టు తెలుస్తున్నది. దీంతో సిరాజ్ తండ్రి, కుటుంబసభ్యులతోపాటు సమీర్ కుటుంబసభ్యుల కదలికలపై మరింత నిఘా పెంచాయి.